క్లుప్తంగా

దివ్యాంగులకు వాహనాల పంపిణీ



కైకలూరు: దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభవంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 10 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే మోటరైజ్‌డ్ త్రీవీలర్ (స్కూటీ)ను కై కలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.లక్ష విలువ చేసే స్కూటీలను ప్రభుత్వం అందించడం దివ్యాంగులపై నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, కౌన్సెలింగ్ రిహాబిలిటేషన్ మార్కెటింగ్ ఆఫీసరు మునిరాజ్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



గుడ్లవల్లేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ జి.గోపాలరావు కోరారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీలతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని చేపట్టారు. నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలోనే మండలానికి పేరుతేవాలని కోరారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం విక్రయ కౌంటర్ ప్రారంభం




కై కలూరు: ధరల నియంత్రణలో భాగంగా తక్కువ ధరకు రైతు బజారులో బియ్యం విక్రయాలు చేయిస్తున్నట్లు కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత చెప్పారు. స్థానిక రైతు బజారులో పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ట్రేడర్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఫైన్, సాధారణ బియ్యం రకం కేజీ రూ.34, సూపర్‌ఫైన్ (మధ్యరకం) కేజీ రూ.40, సూపర్ ఫైన్ (మంచిరకం) రూ.48కు కౌంటర్‌లో విక్రయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ ఆఫీసరు నందినీదేవీ, రైస్ ట్రేడర్స్ అసోషియేషన్ ప్రతినిధులు, రైతు బజారు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ అభివృద్ధికి సూచనలు సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 25464కు తెలియ జేయాలని ఆయన సూచించారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



పెడన: విద్యార్థులను స్కూళ్లకు తీసుకువెళ్లే ఆటో, బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలతో పాటు ఆర్టీఏ నిబంధనలను పాటించాలని పెడన ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో సోమవారం ఆయన ఆటో, బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిని ఉద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. యూనిఫాం ధరించడం నామోషి కాదని, వృత్తికి చిహ్నంగా భావించి గౌరవించి నడుచుకోవాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దన్నారు. పల్లోటి స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రయాణికులుగా భావించకుండా తమ సొంత బిడ్డలు వలే పాఠశాలలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఆటో, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

సమస్త సేవల నిలయం

- సేవాలయాలుగా సచివాలయాలు
- ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు
- నియోజకవర్గంలో 79 సచివాలయాలు

కై కలూరు: సమస్త సేవల నిలయంగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సంక్షేమాన్ని అందించే దీపికగా ప్రభుత్వ సేవలను అందిస్తూ సచివాలయ వ్యవస్థ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున తూర్పుగోదావరి జిల్లా కరపలో సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు 7 డిసెంబరు, 2022న అర్డినెన్సును ప్రభుత్వం తీసుకువచ్చింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించి సచివాలయ సిబ్బంది ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నారు.

79 సచివాలయాలు..869 మంది సిబ్బంది..

నియోజకవర్గ కై కలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి నాలుగు మండలాల్లో 79 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు కేటాయించారు. మొత్తం అన్ని సచివాలయాల్లో 869 మంది వివిధ శాఖల సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారు. సచివాలయ నూతన నిర్మాణాలకు రూ.31.60 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. నియోజకవర్గంలో ఇప్పటికే 39 సచివాలయాలను పూర్తి చేశారు. మరో 40 సచివాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. సంతృప్తికర రీతిలో పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తూ ప్రజల ఆశీస్సులు పొందుతున్నారు.

సేవలన్నీ ఒకే గూటిలో...

గత పాలనలో రిజిస్ట్రేషన్ నిమిత్తం కుటుంబం మొత్తం మండల కేంద్రానికి వచ్చి అనేక ఇబ్బందులు పడేవారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. నేడు ఒక్కో సచివాలయంలో అన్ని సేవలు అందుతున్నాయి. సచివాలయంలో పంచాయతీ, గ్రామ మహిళా సంరక్షణ, రెవెన్యూ సెక్రటరీలు, డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, వెటర్నరీ, ఫిషరీస్, ఎమర్జెన్సీ, సర్వే, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు కలిపి మొత్తం 11 మంది శాఖల అధికారులు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల కేంద్రంగా రైతు భరోసా కేంద్రాలు, మల్టీపర్పస్ ఫంక్షన్ సెంటర్స్ (ఎంపీఎఫ్‌సీ), వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పాల వెలుగు కేంద్రాలు, ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లు వివిధ సేవలు ప్రజలకు అందిస్తున్నాయి. నేడు సచివాలయ స్థాయిలో గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల వంతున కేటాయించారు.



కైకలూరు మండలం చటాకాయిలో సచివాలయం

నియోజకవర్గంలో సచివాలయాలు ఇలా...

మండలం	సచివాలయాలు	అంచనా (రూ.కోట్లలో)	పూర్తయినవి	నిర్మాణం
కైకలూరు	22	8 కోట్ల 88 లక్షలు	9	13
కలిదిండి	20	8 కోట్లు	13	7
మండవల్లి	16	6 కోట్ల 40 లక్షలు	5	11
ముదినేపల్లి	21	8 కోట్ల 40 లక్షలు	12	9
మొత్తం	79	రూ.31 కోట్ల 68 లక్షలు	39	40



సచివాలయ సిబ్బంది

సేవ చేసే అవకాశం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఆక్వా రైతులకు సచివాలయాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. కియోస్క్ యంత్రాల ద్వారా చేపల, రొయ్యల మేతలను ఆర్డర్ ఇచ్చి సరఫరా చేస్తున్నాం. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సేవలు మరింత సులభతరమయ్యాయి.

– రాజేష్, గ్రామ మత్స్యశాఖ సహాయకులు, కైకలూరు

అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు



సచివాలయాలు గొప్పగా పనిచేస్తున్నాయి. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అనేక రోజులు మండల కార్యాలయాలకు చుట్టూ తిరిగాను. నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీరు వచ్చి వివరాలు తీసుకుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సచివాలయ వద్ద కొన్ని గంటల వ్యవధిలోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు.

– బొలిశెట్టి జ్యోతి, కైకలూరు

ఇంటి పట్టాల పంపిణీ



కైకలూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. మండవల్లి మండలం అప్పాపురానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు కై కలూరు గ్రీన్ విలేజ్ వద్ద పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలానికి చెందిన పలు కొల్లేరు గ్రామాల ప్రజలకు సైతం ఇంటి పట్టాలను కేటాయించామన్నారు. భవిష్యత్తులో గ్రీన్ విలేజ్ పెద్ద నగరంగా మారుతుందన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ముదినేపల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, అయ్యవారిరుద్రవరం నుంచి లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్పందనలో డీటీకి అర్జీ

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఎం సుధారాణికి ఐక్య వేదిక సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సాయంత్రం 4 గంటల వరకే పనిచేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రసూతి తదితర వైద్య సేవలకు రాత్రి సమయంలో వస్తే ఆస్పత్రి, మూసి ఉండటంతో వారికి వైద్య సేవలు అందడం లేదన్నారు. ఆసుపత్రిని 24 గంటలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భాస్కరరావు, టి.అప్పారావు, వి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మాది పేదల ప్రభుత్వం



పులపర్రులో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, పక్కన ఎంపీపీ పెద్దిరెడ్డి



గుడివాడలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



పసుమర్రులో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న జెడ్పీటీసీ స్వరూపరాణి, ఎంపీపీ అశోక్‌కుమార్

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గంలో కై కలూరు-2, కలిదిండి-1, ముదినేపల్లి-1 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా సోమవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఎవ్వరూ లేరన్నారు. గతంలో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రాల చుట్టూ ప్రజలు తిరిగేవారన్నారు. నేడు ఇంటి వద్దకు వచ్చి సచివాలయ సిబ్బంది 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారని తెలిపారు. ముదినేపల్లిలో ఇప్పటి వరకు రూ.30.70 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కలిదిండిలో రూ.40 లక్షల నిధులతో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పలు సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు గంటా సంధ్య, ఏఎంసీ చైర్మన్ దండే పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ, రమేష్, ఏసుబాబు, సర్పంచ్‌లు నవరత్నకుమారి, మారుతీ ప్రసన్న, కైకమ్మ, ఎంపీటీసీలు నీలి సుమన్, చాన్ బాషా, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, కనకదుర్గారాణి, నాగలక్ష్మి, రాచూరి రాధ, తహసీల్దారు బి.మురళీకృష్ణ, వంశీ, ఎంపీడీవో జి.రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

పసుమర్రు(పామర్రు): అర్హత ఉండీ సంక్షేమ పథకాలు అందనివారికి సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతోందని పామర్రు జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, ఎంపీపీ డి. అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని పసుమర్రు సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి ధ్రువీకరణ పత్రాలను సత్వరమే అందిస్తున్నామన్నారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, గ్రామ సర్పంచ్ కాకి నాగేంద్రరరావు, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఎంఈవో పద్మ సుధ, డీటీ యాదమరెడ్డి మల్లేశ్వరరావు, వీఆర్వో సాయిబాబు, కార్యదర్శి పద్మశ్రీ వేణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

గుడివాడ టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావడంలో వలంటీర్ల సేవలు అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో సోమవారం కూడా కొనసాగింది. స్థానిక 28వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సురక్ష ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. వారం రోజుల ముందు నుంచే వార్డులోని 36 మంది వలంటీర్లు కష్టపడి పనిచేశారన్నారు. దాని ఫలితంగా నేడు 1905 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. వలంటీర్ల సేవలు అద్భుతంగా ఉన్నాయి అనడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ వార్డు వలంటీర్లు నిరూపించారన్నారు. ఇదే వార్డుకు చెందిన వలంటీరు జి.సంధ్యారాణి చేసిన సేవలను గుర్తించి సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ ఆమె ఇంటికి వెళ్లి ఆమెను సత్కరించడం వలంటీర్ల కృషికి నిదర్శనమన్నారు. అదే పట్టుదలతో మిగిలిన వలంటీర్లు కూడా పనిచేస్తున్నందునే నేడు రికార్డు స్థాయిలో 1905 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్‌లు బూసి ప్రకాష్, కె.గణపతి, వీరిశెట్టి నరసింహారావు, పురుషోత్తం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక 11వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు పాల్గొన్నారు. 898 మందికి వివిధ రకాల ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

మండవల్లి: పేదలకు అండగా జగనన్న సురక్ష నిలుస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పులపర్రు సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి రాజు, సర్పంచ్ వేంద్ర నాగరాజు, ఎంపీటీసీ దారం రమేష్, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలా ఆదినారాయణ, బొబ్బిలి రత్తయ్యనాయుడు, నీలం పద్దమ్మ, చంద్రాల సూరిబాబు, అంబటి సుబ్రహ్మణ్యం, మోరు నాగేంద్రరావు, తహసీల్దార్ కె రాజ్‌కుమార్, ఎంపీడీఓ టీకే వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాములలంక వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మించండి

జిల్లా కలెక్టర్‌కు స్పందనలో వినతి



జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు-పాముల్లంక మధ్య కృష్ణానది పాయపై వంతెన నిర్మాణం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ అర్జీని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం కోసం2014 ఫిబ్రవరి,5వ తేదీన రూ.13.5 కోట్లను మంజూరు అయి శంకు స్థాపన కూడా జరిగింది. తర్వాత కాలంలో సెప్టెంబరు, 2022లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ వంతెన నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రూ.31.50 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇంత వరకు వంతెన నిర్మాణం ప్రారంభం కాలేదని అర్జీలో పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణం పనుల తోట్లవల్లూరు మండలంలోని లంక గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైందని అన్నారు. ఈ వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరుకు అర్జీని స్పందనలో సమర్పించామని తెలిపారు.

ఇంటింటి సర్వే విజయవంతం చేయాలి



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి

పామర్రు: బూత్ లెవెల్ అధికారులు అందరూ ఈనెల 21 వ తేదీ నుంచి నిర్వహించే ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బూత్ లెవెల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు అందరూ మండలంలోని 25 గ్రామాలలో ఇంటింటికి తిరిగి సర్వేను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. మృతిచెందిన వారి వివరాలను లిస్టు నుంచి తొలగించి , 18 ఏళ్ల నిండిన వ్యక్తుల పేర్లను కొత్తగా నమోదు లిస్టులలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నమోదు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా ఏవిధమైన ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అన్నారు. ఈ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి అయ్యే విధంగా అందరూ కలిసి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సీనియర్‌అసిస్టెంట్ రాము , బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్వాజోన్ పరిధిలో ఉన్న భూములకే అనుమతులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆక్వా జోన్ పరిధిలో ఉన్న భూములకు మాత్రమే ఆక్వా సాగుకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. సోమవారం ఆక్వా జోనేషన్ రీ-సర్వే పురోగతిపై మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూముల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. గతంలో అనుమతులు పొంది ఆక్వా జోన్ పరిధిలో సాగు చేస్తూ లైసెన్సు గడువు ముగిసిన వారు, నాన్ ఆక్వాజోన్ పరిధిలో అనధికారికంగా సాగు చేస్తున్న భూములను గుర్తించాలన్నారు. లైసెన్సులను పునరుద్ధరించదగిన వాటికి నిబంధనల మేరకు చేయాలని చెప్పారు. ఆ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను బట్టి వ్యవసాయానికి పనికిరాని భూములను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా ఆక్వా సాగుచేస్తున్న చెరువులను గుర్తించటంతోపాటు తక్కువ విస్తీర్ణంలో లైసెన్సు పొంది ఎక్కువ విస్తీర్ణంలో చెరువులు తవ్వి సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల న్నారు. అనధికారికంగా సాగు చేస్తున్న వారి వివరాలను ఈ నెల 31వ తేదీ నాటికి నివేదికను సమర్పించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను పకడ్బందీగా నిర్వహించండి

జిల్లాలో జగనన్న సురక్షపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రత్యేక కార్యదర్శి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయం నుంచి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, అదనపు కార్యదర్శులు ముత్యాలరాజు, భరత్‌గుప్తాలు కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం కృష్ణాజిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. ఇంటింటికి సర్వే, ధ్రువీకరణ పత్రాల జారీ 92 శాతం పూర్తయ్యిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లాలో 82 శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. పరిష్కారం పొందిన ప్రతి ఒక్కరు పౌరునిలో సంతృప్తిస్థాయి పెంపొందించామని చెప్పారు. అనంతరం కలెక్టర్ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వహించరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్నకు చెబుదాం నోడల్ అధికారి శివనారాయణరెడ్డి, డీఎల్‌డీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు శిబిరాన్ని ప్రారంభించారు. హోమియో వైద్యుడు డాక్టర్ మణికంఠ రోగులకు పరీక్షించి వారికి అవసరమైన మందులు క్లబ్ సహకారంతో ఉచితంగా అందజేశారు. క్లబ్ ప్రతినిధులు దింటకుర్తి జ్యోతి, అనూష, వాణి, నంబూరి కుసుమకుమారి పర్యవేక్షించారు.

డాక్టర్ మహేష్‌కు అభినందన

చిలకలపూడి(మచిలీపట్నం):జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో అమర్‌నాథ్ యాత్రకు వచ్చే భక్తులకు వైద్యసహాయం నిమిత్తం జిల్లాకు చెందిన వైద్యాధికారి సేవలు అందించటంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి అభినందనలు తెలిపారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యాధికారి యార్లగడ్డ మహేష్ గందర్బల్ జిల్లాలో ఉన్న బాల్టాల్ బేస్ క్యాంప్ ఆస్పత్రిలో యాత్రికులకు వైద్యసేవలు అందించేందుకు విధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు డీఎంహెచ్‌ఓ సిఫార్సు చేశారు. దీంతో వైద్యాధికారి మహేష్ జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు యాత్రకు వచ్చిన ప్రయాణికులకు వైద్యసేవలు అందించి తిరిగి అవనిగడ్డకు చేరుకున్నారు. అమర్‌నాథ్ యాత్రకు వచ్చిన యాత్రికులకు వైద్యసేవలు అందించటంపై డీఎంహెచ్‌ఓ గీతాబాయి ఆయనను అభినందించారు.

వైభవంగా శ్యామలాంబదేవి జయంతి



పెడన: దేవాంగ సామాజిక వర్గ ఆరాధ్య దైవం శ్రీశ్యామలాంబ అమ్మవారి జయంతి మహోత్సవాలను సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి చౌడేశ్వరి దేవాలయం, భజనగుడి, శ్రీశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భజనగుడిలోని అమ్మవారి చిత్రపటాన్ని శాకంబరిదేవీగా అలంకరించారు. అదే విధంగా శ్యామలాంబ సమేత ఆలయంలోని అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఏకరుద్రాభిషేకం, కుంకుమార్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ముత్యాలమ్మ ఘటం గుడిలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com